క్లుప్తంగా

పీహెచ్‌సీ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

రామగిరి: మండలంలోని బేగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని పలు రికార్డులను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులతో మర్యాదగా ఉండాలని, వైద్యసేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్‌వీబీ సీడీపీ శ్రీరాములు, డా.సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

ఆరోగ్యంగా ఉండాలి



దొంగతుర్తిలో పర్యటిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో అన్నప్రసన్న

ధర్మారం: ఇంటి పరిసరాలను ప్రతీఒక్కరు పరిశుభ్రంగా ఉంచుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో అన్నప్రసన్న సూచించారు. మేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుస్మిత ఆధ్వర్యంలో దొంగతుర్తిలో ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. గ్రామంలో పర్యటించారు. అనంతరం మేడారం పీహెచ్‌సీని సందర్శించి రికార్డులు పరిశీలించారు. డాక్టర్ గౌతం, ఎంఎల్‌హెచ్‌పీ శ్రీలేఖ, పీహెచ్ఎస్ విజయలలిత, మలేరియా సబ్ యూనిట్ అధికారి అంజయ్య, హెల్త్ అసిస్టెంట్ దామోదర్‌రెడ్డి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు సమస్య పరిష్కరించాలి



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి ఆదిరెడ్డి

కమాన్‌పూర్: మండల కేంద్రంలో డంపింగ్ యార్డు సమస్య పరిష్కరించాలని మండల ప్రత్యేక అధికారి దోమ ఆదిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో సేకరించిన చెత్తను డంప్ చేయడానికి డంపింగ్ యార్డు లేకపోవడంతో సేకరించిన చెత్తను ప్రధాన రహదారుల వెంట వేస్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. గ్రామ శివారులో ఎక్కడైనా ప్రభుత్వ భూమి ఉంటే గుర్తించాలని, లేకుంటే ఇతర ప్రాంతాల్లో డంపింగ్ యార్డు ఏర్పాటు చేసుకునేందుకు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంపీడీవో లలిత, కార్యదర్శులు పాల్గొన్నారు.

డ్రాయింగ్‌లో రాణించాలి

సుల్తానాబాద్: విద్యార్థులు చదువుతోపాటు డ్రాయింగ్, కళారంగాల్లో రాణించాలని వివేకానంద ఎడ్యుకేషన్ సొసైటీ డైరెక్టర్ రవీందర్ సూచించారు. పట్టణంలోని ట్రెండ్స్ రైతులు, జవాన్ల స్థితిగతులపై మంగళవారం డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. పట్టణానికి చెందిన అనుకృతి, కమల్ మొదటి, 2వ బహుమతికై వసం చేసుకున్నారు. పాఠశాల డైరెక్టర్ సుజాత, ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు మల్లన్న సన్నిధిలో లక్షబిల్వార్చన

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో 29న ఉదయం 9గంటలకు లక్షబిల్వార్చన పూజలు జరుగుతాయని దేవస్థానం చైర్మన్ మేకల మల్లేశంయాదవ్, ఈవో బి.సదయ్య మంగళవారం తెలిపారు. ప్రతీ ఏటా శ్రావణమాసంలో జరిగే లక్షబిల్వార్చనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

నిరుపేద విద్యార్థికి సైకిల్ అందజేత

గోదావరిఖనిటౌన్: నగరంలోని గణేశ్‌నగర్‌కు చెందిన పేద విద్యార్థికి లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని స్ఫూర్తి ప్రధాన కార్యదర్శి మామిడిపెల్లి శ్రీధర్ సైకిల్ అందజేశాడు. కార్యక్రమంలో స్ఫూర్తి అధ్యక్షుడు నార్ల ప్రసాద్, ట్రెజరర్ కోదాటి ప్రవీణ్, డీసీజేఎస్ జయప్రకాశ్ చౌడ, జీఈటీ శేగంటి నరేశ్, జెడీసీ గుంత వినోద్ పాల్గొన్నారు.

అధికారులకు వినతి

కమాన్‌పూర్: మండల పరిధిలోని చెరువులు, కుంటలు, పంటకాలువలను ఆక్రమించిన వారిపై, గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకులు మంగళవారం తహసీల్దార్ ఆరిఫొద్దీన్, ఎంపీడీవో లలితకు వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు బొమ్మగాని అనిల్, లక్ష్మిమల్లు, రామ్మూర్తి, నవీన్, రాజ్‌కుమార్ ఉన్నారు.

వ్యాధుల కట్టడికి చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

మంథని: వర్షాకాలంలో నిల్వ ఉన్న నీటిలో దోమలు వృద్ధి చెంది వైరల్ జ్వరాలు, డెంగీ, మలేరియా, చికున్‌గున్యా తదితర వ్యాధులు వ్యాపిస్తాయని, వాటి కట్టడికి పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గుంజపడుగు గ్రామంలో మంగళవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. గ్రామపంచాయతీ కార్యాలయం, వైరల్ జ్వర బాధితుల నివాసాలు పరిశీలించారు. నిల్వ నీటిని తొలగింపజేశారు. ఆ ప్రాంతాల్లో స్థలాలు శుభ్రం చేయించారు. ఇళ్లలో నీటినిల్వలు లేకుండా శుభ్రం చేసుకోవాలని, పరిసరాల పరిశుభ్రత ద్వారా వైరల్ జ్వరాలను అరికట్టవచ్చని కలెక్టర్ తెలిపారు. నిల్వనీటిలో దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్‌బాల్స్ వేయాలని ఆదేశించారు. క్రమంతప్పకుండా ఫాగింగ్ చేయాలని ఆయన సూచించారు. జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, డివిజనల్ పంచాయతీ అధికారి సతీశ్, మంథని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పూర్ణచందర్‌రావు ఉన్నారు.

విద్యా ప్రమాణాల పెంపు లక్ష్యం

రామగిరి: గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. కల్వచర్ల గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. తొలుత గ్రామ పంచాయతీ కార్యాలయ భవనం పరిశీలించారు. రోజూ పారిశుధ్య పనులు చేపట్టాలని, ఇంటింటా చెత్త సేకరించాలని సిబ్బందిని ఆదేశించారు. సెగ్రిగేషన్ షెడ్ల ద్వారా ఎరువుల తయారీకి చర్యలు తీసుకోవాలని సూచించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు. తరచూ తాగునీటి నాణ్యత పరీక్షలు చేయాలని అన్నారు. సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. విషజ్వరాలపై మండల వైద్యాధికారి ప్రదీప్‌ను అడిగి వివరాలు ఆరా తీశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించారు. వారి విద్యా ప్రమాణాలను పరీక్షించారు. ప్రతీ విద్యార్థి ప్రాథమిక ప్రమాణాలు పెంపొందించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కిచెన్ షెడ్డు, మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. గ్రామంలో అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయని పలువురు గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన గ్రామస్తులతో కలిసి రోడ్లు పరిశీలించారు. సుమారు 20 ఏళ్లక్రితం రోడ్లు నిర్మించారని, ఇవి గుంతలమయంగా మారి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. ఉపాధిహామీ ద్వారా పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీపీవో ఆశాలత, ఎంపీడీవో శైలజారాణి, ఎంపీవో ఉమేశ్, పీఆర్ ఏఈ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



మురుగునీటి కాలువను పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎరవల్లి ముత్యంరావు

గోదావరిఖని: సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎరవల్లి ముత్యంరావు విమర్శించారు. జీడీకే–11గనిపై మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు కార్మికులకు సొంతింటి పథకం అమలు చేస్తామని, అలవెన్స్‌లపై ఇన్‌కం ట్యాక్స్ రీయింబర్స్‌మెంట్ చేస్తామని, బొగ్గు బ్లాక్‌ల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని, వాస్తవ లాభాలు ప్రకటించి 35 వాటా చెల్లిస్తామని హామీలు ఇచ్చినా నేటికీ అమలు చేయడం లేదన్నారు. సింగరేణి నిధులను దారి మళ్లించే ప్రయత్నం ఇప్పటికీ కొనసాగుతోందని ఆయన ఆరోపించారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలనే కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందని దుయ్యబట్టారు. సింగరేణికి రావాల్సిన రూ.30వేల కోట్ల బకాయిలను ఇప్పటివరకు చెల్లించలేదని అన్నారు. రాష్ట్రానికి ఆర్థికపరమైన సంక్షేమ పథకాల విషయంలో వెన్నుదన్నుగా నిలుస్తున్న సింగరేణి కార్మికులపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందన్నారు. గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరిగి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇప్పటికీ గుర్తింపు పత్రం ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ ప్రభుత్వం, యాజమాన్యం అనుకూల సంఘాలుగా మారాయని ధ్వజమెత్తారు. అందుకే సీఐటీయూ కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఈనెల 20 నుంచి 28వ తేదీ వరకు సంతకాల సేకరణ ఉద్యమం చేపట్టి సంబంధిత గని మేనేజర్లకు వినతిపత్రాలు అందజేస్తోందని వెల్లడించారు. వీటితోపాటు ఈనెల 28న అన్ని జీఎంల కార్యాలయాల ఎదుట ధర్నా చేస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ బ్రాంచి అధ్యక్ష కార్యదర్శులు ఆరెపల్లి రాజమౌళి, మెండే శ్రీనివాస్, నాయకులు తోట నరహరిరావు, జెల్ల గజేంద్ర, శంకరన్న, జంగాపల్లి మల్లేశ్, నవీన్‌కుమార్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శాంతిభద్రతల పరిరక్షణకే కార్డెన్‌సెర్చ్



మాట్లాడుతున్న సీఐ ప్రవీణ్‌కుమార్

రామగుండం: గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకే కార్డెన్‌సెర్చ్ నిర్వహిస్తున్నామని రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. అక్బర్‌నగర్‌లో మంగళవారం అంతర్గాం పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఇటీవల కాలంలో యువత డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. అలాంటి వారి వ్యవహారశైలిపై కుటుంబసభ్యులు ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలకు లోబడి డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్, పొల్యూషన్ పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. గ్రామంలో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. గ్రామంలోని ద్విచక్ర వాహనాలను అక్బర్‌నగర్ కూడలి వద్దకు చేర్చి ధృవీకరణపత్రాలను పరిశీలించారు. సమావేశానికి అంతర్గాం ఎస్సై బోయ వెంకట్ అధ్యక్షత వహించగా రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్, రామగుండం ఎస్సై సమ్మయ్య, వివిధ పోలీస్‌స్టేషన్లకు చెందిన సిబ్బంది హాజరయ్యారు.

ఖాళీ గదులకు తాళం

సాక్షి ఎఫెక్ట్..

పెద్దపల్లిరూరల్: జిల్లా ప్రభుత్వాసుపత్రిలోని ఖాళీ గదులను ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ శ్రీధర్ పరిశీలించారు. సాక్షి దినపత్రికలో మంగళవారం 'మందుబాబులకు అడ్డాగా ప్రభుత్వాసుపత్రి' శీర్షికన ప్రచురితమైన వార్తకు స్పందించారు. గదుల్లో ఉన్న ఖాళీ మద్యం సీసాలను పారిశుధ్య సిబ్బందితో తొలగింపజేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఖాళీగా ఉన్న గదులను శుభ్రం చేయించి తాళం వేయించారు.



విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



ఓదెల: మండలంలోని మడక ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన టీఆర్ఎస్వీ విద్యార్థి విభాగం రాష్ట్రనాయకులు రాజోజుల శివకుమార్ బ్యాగులు అందజేశారు. 100మంది విద్యార్థులకు అందజేసిన బ్యాగులను ఎంఈవో ఆరెపల్లి రాజన్న మంగళవారం పంపిణీ చేశారు. మడక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేలా బ్యాగులు అందజేసినట్లు శివకుమార్ తెలిపారు. ప్రధానోపాధ్యాయులు అశోక్‌రెడ్డి, కార్యదర్శి జ్యోతి, ఫీల్డ్ అసిస్టెంట్ ఆవాల ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమం సందర్శన

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ వీర్లపల్లిలో ఈశ్వరకృప వృద్ధాశ్రమాన్ని అదనపు కలెక్టర్ అరుణశ్రీ మంగళవారం సందర్శించారు. ఆశ్రమంలో సేదదీరుతున్న వృద్ధులతో మాట్లాడారు. వారి యోగక్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇబ్బందులు ఉంటే అధికారులు దృష్టికి తేవాలని, తద్వారా వారు పరిష్కరిస్తారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రవుఫ్‌ఖాన్, ఈశ్వర కృప వృద్ధాశ్రమం అధ్యక్షుడు పీటీ స్వామి, డైరెక్టర్ ఎల్.మాధవరెడ్డి, గీతాదేవి, బట్టల వెంకటయ్య, రామచంద్రరావు, సత్యనారాయణ, సలహాదారి సీతారామరెడ్డి, డాక్టర్ ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

సంక్షిప్త వార్తలు

● **చెరువులను పరిరక్షించండి**

పెద్దపల్లిరూరల్: హైదరాబాద్‌లో చెరువుల పరిరక్షణకు ప్రభుత్వం చేపట్టిన హైడ్రా తరహా కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి కోరారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోనూ రాజకీయ ప్రముఖులు, పలుకుబడి గలవారు చెరువులు, కుంటలను కబ్జా చేశారని ఆరోపించారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి కబ్జాదారుల చెర నుంచి విముక్తి చేయాలని డిమాండ్ చేశారు.

● **కుంటలను కాపాడాలని వినతి**

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని చెరువులు, కుంటలను పరిరక్షించాలని ఎన్‌హెచ్ఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు వంశీరాజ్ కోరారు. మంగళవారం కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతిపత్రం అందించారు.

● **పరామర్శ**

ధర్మారం: సిద్దిపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కాడే సూర్యనారాయణను మంగళవారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పరామర్శించారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు.

● **దళిత రెవెన్యూ ఉద్యోగుల సమాచారం ఇవ్వాలి**

ఎలిగేడు: జిల్లా నూతనంగా ఏర్పడినప్పటి నుంచి 2024వరకు రెవెన్యూశాఖలో దళిత ఉద్యోగులు ఎంత మంది ఎక్కడెక్కడ పనిచేస్తున్నారు సమాచారం ఇవ్వాలని సమాచార హక్కుచట్టం కింద మంగళవారం కలెక్టర్ కోయ శ్రీహర్షకు మండలంలోని బుర్హాన్‌మియాపేట మాజీ సర్పంచ్ రాచర్ల కొండయ్య వినతిపత్రంలో కోరారు.

● **రైతులందరికీ రుణమాఫీ చేయండి**

పెద్దపల్లిరూరల్: పంటసాగు చేసిన రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం కోరారు. పార్టీ నాయకులతో కలిసి మంగళవారం అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీకి వినతిపత్రం అందించారు.

● **ఆర్థికసాయం అందజేత**

ఓదెల: ఓదెలలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన గోపతి మొండక్క, బుద్దె రవీందర్ కుటుంబాలకు రూ.5వేల చొప్పున పెరక సంఘం అధ్యక్షుడు గోపతి ఎల్లయ్య మంగళవారం అందజేశారు.

● **పరిశుభ్రతతో అంటువ్యాధులు దూరం**

ఓదెల: పరిసరాల పరిశుభ్రతతో అంటువ్యాధులు దూరం అవుతాయని ఎంపీడీవో తిరుపతి, ఎంపీవో షబ్బీర్ అన్నారు. మండలంలోని శానగొండ గ్రామంలో మంగళవారం ఎంపీడీవో, ఎంపీవోలు పరిసరాలను పరిశీలించారు.

● **బీథర్మల్‌లో ఉద్యోగులకు పదోన్నతి**

రామగుండం: పట్టణంలోని బీ–థర్మల్ విద్యుత్ కేంద్రంలోని పరిపాలన భవన్‌లో విధులు నిర్వహిస్తున్న వై.అనిత, శైలజకు అకౌంట్స్ ఆఫీసర్‌గా పదోన్నతి లభించింది. స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్–1535 ఆధ్వర్యంలో పదోన్నతి పొందిన వారిని మంగళవారం అభినందించారు.

● **ఎరువుల దుకాణాలు తనిఖీ**

ధర్మారం: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి బండ రాజు మంగళవారం తనిఖీ చేసి ఎరువుల నమూనాలను సేకరించారు. దుకాణాలు, గోదాంలు, స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు.

● **మొక్కల పరిశీలన**

రామగుండం: మంగళవారం అంతర్గాం మండల పరిధిలోని గోలివాడ పంపుహౌస్ శివారు మట్టికుప్పలతో పాటు ముర్మూర్ తదితర గ్రామాల్లో నాటిన మొక్కలను ఎంపీడీవో అలీం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏపీవో రమేశ్ ఉన్నారు.

● **ఉచిత వైద్య శిబిరానికి స్పందన**

ఓదెల: మండలం పిట్టలఎల్లయ్యపల్లెలో నల్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నల్ల మనోహర్‌రెడ్డి నాయకత్వంలో మంగళవారం నిర్వహించిన ఉచితవైద్య శిబిరానికి స్పందన లభించింది. కరీంనగర్‌కు చెందిన కెల్విన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

● **శ్రీభక్తాంజనేయ ఆలయంలో పూజలు**

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు సుమంత్‌చార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● **తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు**

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాగినేడు గ్రామానికి చెందిన పొన్నం శ్రీనివాస్ మంగళవారం ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి జారిపడి గాయాలపాలయ్యాడు. కల్లుగీసి తాటి చెట్టుపై నుంచి కిందకు దిగుతుండగా జారి పడగా గాయాలయ్యాయని కుటుంబీకులు తెలిపారు.

● **శ్రీకృష్ణాష్టమి వేడుకలు**

పాలకుర్తి: బసంత్‌నగర్‌లోని ఆలీవర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మంగళవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు.

● **కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ**

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో జి.హర్షవర్ధన్, జి.రిషవర్ధన్ బంగారు పతకాలు సాధించారు. కరీంనగర్‌లో 25న నిర్వహించిన పోటీల్లో పతకాలు సధించారని పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణప్రియ తెలిపారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు.

● **రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు**

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్ రాజీవ్ రహదారి వద్ద కారు ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్‌కు చెందిన రవి ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్‌లో హోటల్ నిర్వహిస్తుంటాడు. మంగళవారం సాయంత్రం రోడ్డు దాటుతుండగా రామగుండం వైపు నుంచి వస్తున్న ఓ కారు ఢీకొట్టింది. రవి తలకు గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పోలీసులు ప్రమాదస్థలాన్ని పరిశీలించారు.



ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ ఖాజీపల్లిలో మండల పరిషత్ పాఠశాలలో వీధికుక్కలు విద్యార్థులపై దాడి చేశాయి. దీంతో పాఠశాలకు రావడానికి విద్యార్థులు జంకుతున్నారు. రామగుండం నగరపాలక సంస్థ అధికారులు స్పందించి వీధికుక్కలను తరలించేలా చర్యలు చేపట్టాలి.

– బొమ్మల సత్యనారాయణ, హెచ్ఎం, మండల పరిషత్ పాఠశాల, ఖాజీపల్లి

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
నగరపాలక కమిషనర్, సీహెచ్.శ్రీకాంత్, ఫోన్: 98499 05878

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 97053 46608

సింగరేణి అభివృద్ధికి కృషి చేయాలి

రామగిరి: క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని, ప్రతీ ఉద్యోగి సింగరేణి అభివృద్ధికి కృషి చేయాలని ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు కోరారు. ఏపీఏ ఏరియాలోని ఎంవీటీసీలో 48 రోజుల పాటు శిక్షణ పూర్తయిన 15 మంది డిపెండెంట్లకు మంగళవారం జీఎం కార్యాలయంలో పోస్టింగ్ ఉత్తర్వులు అందజేశారు. అనంతరం జీఎం మాట్లాడుతూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, విధి నిర్వహణలో అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ భద్రతతో విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ కె.యాదయ్య, ఎస్‌వోటూ జీఎం బి.సత్యనారాయణ, పర్సనల్ మేనేజర్ బి.సుదర్శనం, అధికారులు పి.డి.సుధాకర్, మల్లన్న పాల్గొన్నారు.



ఉత్తర్వులు అందజేస్తున్న జీఎం వెంకటేశ్వర్లు

సెక్యూరిటీ జీఎంకు సన్మానం

గోదావరిఖని: నెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్న సెక్యూరిటీ జీఎం బీఆర్ దీక్షితులును మంగళవారం సన్మానించారు. ఆర్జీ–1 జీఎం కార్యాలయంలోని జీఎం చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో సన్మానించి జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి, జూనియర్ ఇన్‌స్పెక్టర్ చంద శ్రీనివాస్, జమేదార్ యాట ఓదెలు, సెక్యూరిటీ సిబ్బంది ఎస్.మల్లేశ్, ఎం.తిరుపతి, రాధాకృష్ణ, రమేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న సెక్యూరిటీ అధికారులు

సింగరేణి అధికారులకు క్వార్టర్ల కౌన్సెలింగ్

రామగిరి: ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులకు మంగళవారం జీఎం ఎస్.సుధాకర్‌రావు ఆదేశాల మేరకు సెంటనరీకాలనీలోని క్వార్టర్ల కోసం జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. 29 మంది అధికారులు దరఖాస్తు చేసుకోగా 28 మంది హాజరై 19 మంది క్వార్టర్ ఎంపిక చేసుకున్నారని ఆర్జీ–3 ఇన్‌చార్జి ఎస్‌వోటూ జీఎం రాధాకృష్ణ తెలిపారు. వారికి త్వరలోనే అలాట్‌మెంట్ లెటర్స్ ఇస్తామని పేర్కొన్నారు. పర్సనల్ మేనేజర్ బి.సుదర్శనం, డీవైపీఎం గుర్రం శ్రీహరి, వి.సునీల్ ప్రసాద్, క్వార్టర్ల విభాగం క్లర్క్ మహేందర్ పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ ఇస్తున్న జీఎం రాధాకృష్ణ

కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించండి

రామగిరి: ఆర్జీ–3 ఏరియాలో నివసిస్తున్న సింగరేణి కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని మంగళవారం ఆర్జీ–3 జీఎం ఎస్.సుధాకర్‌రావుకు సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. క్వార్టర్‌లలో తాగునీరు, డ్రైనేజీ ఏర్పాటు చేయాలని, కార్మికులకు లాభాల్లో వాటా, సొంతింటి కల హామీలను అమలు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. బొగ్గు బ్లాక్‌ల ప్రైవేటీకరణ నిలిపివేయాలని, శ్రావణ్‌పల్లి బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు.

సంక్షేమ పథకాలను దూరం చేసేందుకు కాంగ్రెస్ కుట్ర

పెద్దపల్లిరూరల్: కార్మికశాఖ ద్వారా కార్మిక కుటుంబాలకు అందుతున్న సంక్షేమ పథకాలను దూరం చేసేందుకు కాంగ్రెస్ సర్కార్ కుట్ర చేస్తోందని సీఐటీయూ అనుబంధ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమారస్వామి ఆరోపించారు. కలెక్టరేట్ ఎదుట మంగళవారం నిరసన తెలిపి అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీకి వినతిపత్రం అందించారు. నాయకులు కొమురయ్య, శ్రీనివాస్, సత్యనారాయణ, శివకుమార్, కృష్ణ ఉన్నారు.

వైభవంగా వరలక్ష్మి వ్రతం

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని శ్రీపెరిక గిద్దె ఆంజనేయస్వామి ఆలయంలో మహిళలు సామూహిక వరలక్ష్మి వ్రతాలు వైభవంగా నిర్వహించారు. మంగళవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించి, గోపూజ కార్యక్రమం చేపట్టారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారి ధర్మప్రచార పరిషత్ కన్వీనర్ మేంగని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కొండపల్కల అభిలాష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. 100 మంది మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. సాదుల సుగుణాకర్ తదితరులు ఉన్నారు.

వైద్య శిబిరం

ముత్తారం: మండలంలోని ఖమ్మంపల్లిలో మంగళవారం ప్రభుత్వ వైద్యుడు అమరేందర్‌రావు వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో 110 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఆరోగ్య సిబ్బంది ఎం.శ్రీనివాస్, బియ్యని లావణ్య, అనిల్, శృతి, దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

'ఆకాశవాణి'లో మన కళాకారులు

ధర్మారం: మండలంలోని బొమ్మారెడ్డిపల్లికి చెందిన ఒగ్గు కళాకారులు ఆకాశవాణి ఆల్ ఇండియా రేడియో, హైదరాబాద్‌లో మంగళవారం 'కుంకుమరాణి'పై ఆటాపాటలతో అలరించినట్లు కొమురవెల్లి దేవస్థానం పూజారి మక్కపల్లి రాజమల్లు యాదవ్ తెలిపారు. ఒగ్గుకథలో భాగంగా ఆల్ ఇండియా రేడియోలో ఈ కార్యక్రమం చేపట్టడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. పూజారి రాజమల్లు, ఆరుగురు కళాకారులు పాల్గొన్నారు.

కార్మికులకు అవగాహన సదస్సు

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో మంగళవారం కార్మికులకు స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఫ్యాక్టరీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో షీ టీం ఇన్‌చార్జి ఏఎస్సై మల్లయ్య మాట్లాడారు. మహిళల రక్షణ కోసం బస్టాండ్, ప్రధాన చౌరస్తా, జనం రద్దీ కలిగిన ప్రాంతాల్లో షీ టీం నిరంతరం పర్యవేక్షిస్తుందని పేర్కొన్నారు. ఎవరైనా మహిళలు వేధింపులకు గురైతే 63039 23700 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. కేశోరాం కంపెనీ అధికారులు, కార్మికులు, పోలీస్ సిబ్బంది శివకుమార్ పాల్గొన్నారు.